క్లుప్తంగా

పైపులైన్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: మండలంలోని కేశవసపురం సమీపంలో పగిలిన తాగునీటి పైపులైన్ ఈవోపీఆర్‌డీ ఎంపీఎన్ రాజేంద్ర గురువారం పరిశీలించారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'పైపులైన్ పగిలి తాగునీటికి కటకట' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. ఆయన మాట్లాడుతూ పైపులైన్‌కు త్వరలో మరమ్మతులు చేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. త్వరలో పైపులైన్ మరమ్మతు చేసి తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సారా స్వాధీనం



సారాను స్వాధీనం చేసుకున్న అధికారులు

కార్వేటినగరం: కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలంలో విస్తృతంగా దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాలు..మండలంలోని యనమల మంద గ్రామం అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు తమ సిబ్బందితో దాడులు చేశారు. ఆ ప్రాంతంలో సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 1400 లీటర్ల బెల్లం ఊటను, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోరారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మునిసుందరం, రామచంద్రయ్య, కృష్ణయ్య, విజయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గంగాధర నెల్లూరు : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్టు జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ గురువారం సాయంత్రం తెలిపారు. ఆమె కథనం.. గంగాధరనెల్లూరు ముక్కల్తూరు రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. సంతపేటకు చెందిన బాలాజీ, సుమతి అక్రమంగా ఆటోలో 545 కేజీల రేషన్ బియ్యం, కొత్త వెంకటాపురానికి చెందిన కరుణాకరన్ ద్విచక్ర వాహనంలో 50 కేజీల బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ ఆదాయం రూ.32 వేలు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయానికి హుండీ ఆదాయం రూ. 32.758 వచ్చినట్లు ఎండోమెంట్ ఈఓ క్రిష్ణనాయక్ గురువారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, వార్షిక ఆడికృత్తిక అనంతరం రెండోసారి హుండీ ఆదాయం లెక్కించినట్లు చెప్పారు. ఈ ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

మతి స్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

వెదురుకుప్పం: మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మరణించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..మండలంలోని మాంబేడు వాసి పి. సంజీవయ్య (80)కు మతిస్థిమితం లేదు. మూడు రోజులుగా అతను కనిపించలేదు. ఈ నేపథ్యంలో గురువారం బావి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు వెళ్లి పరిశీలించారు. సంజీవయ్య శవమై తేలి ఉండటం గుర్తించారు. మృతుడి బంధువులు అక్కడికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

ఆపద్బంధు సేవలు అభినందనీయం



సదాశివన్‌ను అభినందిస్తున్న బాబు

పుత్తూరు: క్రీడల్లో బాల బాలికలను ప్రోత్సహించడంలో ఆపద్బంధు చిల్డ్రన్స్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని తిరుపతి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్.బాబు కొనియాడారు. గురువారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సుమారు 300 మంది క్రీడాకారులకు పీఆర్‌టీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సదాశివన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ట్రస్ట్‌చే భోజన వసతి కల్పించారు. బాబు మాట్లాడుతూ ఎప్పుడు బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించినా చిల్డ్రన్స్ ట్రస్ట్ భోజన వసతి కల్పిస్తోందని తెలిపారు. అనంతరం పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సదాశివన్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓ తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం సునీత, ట్రస్ట్ సభ్యులు రమేష్‌రెడ్డి, గురుప్రసాద్, రమేష్‌యాదవ్, ఢిల్లీనాథ్, పీడీలు పాల్గొన్నారు.

వసతి గృహాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. వసతులు అంతంత మాత్రంగా ఉన్న అద్దె భవనాల్లోనే వసతి గృహాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌కు నూతన భవనం కావాలని స్థానికులు పోరాడుతూనే ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. శిథిలావస్థకు చేరిన భవనాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు వసతులు లేకపోవడంతో నిత్యం అగచాట్లు పడుతున్నారు.

వసతి గృహం.. శిథిల భవనం



నింద్రలో శిథిలమైన బీసీ ప్రభుత్వ హాస్టల్ భవనం

- పక్కా భవనం అందని ద్రాక్షేనా?
- నాలుగేళ్లకు పైగా అద్దె భవనంలోనే
- బీసీ హాస్టల్‌లో విద్యార్థుల అగచాట్లు

నింద్ర: పేద విద్యార్థులకు వసతి కల్పించి విద్యను అందించేందుకు ప్రభుత్వం వసతి గృహాలు నడుపుతోంది. మండలంలోని నింద్ర, శ్రీరామాపురం గ్రామాల్లో బీసీ హాస్టళ్లు ఉన్నాయి. నింద్ర హాస్టల్‌లో 150 మంది, శ్రీరామాపురం హాస్టల్‌లో 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకోగా శ్రీరామాపురం హాస్టల్‌కు మాత్రం నూతన భవనం నిర్మించారు. అయితే నింద్ర బీసీ హాస్టల్‌కు మాత్రం పక్కా భవనం మంజూరు కాలేదు. నూతన భవనం నిర్మించేంత వరకు అద్దె భవనంలో కొనసాగించే ఏర్పాటుచేశారు. త్వరలో నింద్రలోను హాస్టల్ భవనం నిర్మిస్తామని అధికారులు తెలిపారు. అయితే నాలుగేళ్లకు పైగా అద్దె భవనంలోనే కొనసాగుతున్నా అధికారులు నూతన భవన నిర్మాణానికి సంబంధిత ఏ ప్రక్రియ చేపట్టలేదు. అద్దె భవనంలో ఉన్న హాస్టల్లో విద్యార్థులకు సరిపడా వసతులు లేవు. ఈ హాస్టల్‌లో 150 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ ఒకే ఒక మరుగుదొడ్డి, ఒక హాలు, ఒక వంటగది మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 90కు పడిపోయింది. వీరిలో కొందరు సమీప గ్రామాలకు చెందిన వారు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. గతంలో ఉన్న భవనంలో విద్యార్థులకు 5 గదులు, వంట గది, స్నానపు గదులు 2, ఐదు మరుగుదొడ్లు ఉండేవి. భవనం శిథిలావస్థకు చేరడంతో అది విద్యార్థులకు శాపంగా మారింది. అద్దె భవనంలో అరకొర వసతులతో అవస్థపడే పరిస్థితి నెలకొంది. మరోవైపు అద్దె భవనం యజమాని హాస్టల్‌ను ఖాళీ చేయించాలని కోరుతున్నారు. మరోవైపు శ్రీరామాపురంలో నూతన భవనం నిర్మించినా అక్కడ విద్యార్థులు లేక హాస్టల్ మూతబడింది. దీంతో కొత్త భవనం ఉన్నచోట విద్యార్థులు లేరు.. విద్యార్థులు ఉన్నచోట కొత్త భవనం లేదు అన్నట్లు పరిస్థితి తయారైంది. ఈ సమస్యను గత ప్రభుత్వం హయాంలో స్థానికులు అప్పటి మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లగా భవన నిర్మాణంలో భాగంగా పాత భవనాన్ని కూల్చివేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. అయితే పనులు చేపట్టేలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం రావడంతో ఆ పనుల గురించి పట్టించుకోలేదు. ఇకనైనా కొత్త భవనం నిర్మించి సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు ప్రభుత్వం బాసటగా నిలవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూతన హాస్టల్ భవనం నిర్మించాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ హాస్టల్‌కు భవనం నిర్మించాలి. ఉన్న అద్దె భవనంలో విద్యార్థులకు తగిన వసతులు లేవు. అసలు సరిపడా గదులు లేవు. ఉన్న వాటిలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్క మరుగుదొడ్డిని అందరు విద్యార్థులు వాడాలంటే అది సాధ్యమేనా అని అధికారులు ఆలోచించాలి. శిథిలమైన భవనం తొలగించి అక్కడే వసతులతో కూడిన నూతన భవనం నిర్మించాలి.

– కైలాసం, నింద్ర

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలో బీసీ హాస్టల్ భవనం నిర్మిస్తే అది ఇప్పుడున్న విద్యార్థులతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ కళాశాలకు చెందిన విద్యార్థులకు కూడా ఉపయోగపడుతుంది. సమస్య కూడా పరిష్కారమవుతుంది. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించారు. అయినా ఫలితం లేదు. సమస్యపై అధికారులు ఇకనైనా స్పందించాలి.

– సంపత్, నింద్ర

విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది



గతంలో నింద్ర హాస్టల్‌లో 150 మంది విద్యార్థులు ఉండేవారు. అద్దె భవనంలో వసతులు కొరవడే సరికి కొందరు ఇళ్లకెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం 90 మంది మాత్రమే ఉన్నారు. సమీప గ్రామానికి చెందిన పలువురు రాత్రిపూట హాస్టల్లో ఉండడం లేదు. ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇలాగైతే వసతి గృహాల ఏర్పాటుకు ఎలాంటి అర్థం ఉండదు. బీసీ సంక్షేమ శాఖ ఈ అంశంపై స్పందించాలి.

– అనిల్, నింద్ర

'అల్లుకున్న' నిర్లక్ష్యం



విద్యుత్ లైన్‌కు చుట్టుకొన్న పిచ్చిమొక్కలు

విజయపురం : మండలంలో కోసలనగరం దళితవాడ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ తీగలను పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు పెను ప్రమాదాలు జరగవచ్చని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

కొత్త క్రషర్లకు అనుమతులు ఇవ్వద్దు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

నగరి : కొత్త క్రషర్లకు అనుమతులు ఇవ్వద్దని వీకేఆర్ పురం గ్రామస్తులు అధికారులకు సూచించారు. దామరపాకం, వీకేఆర్ పురం గ్రామాల్లో గురువారం భూముల రీసర్వేపై అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామం చుట్టూ క్రషర్లకు అనుమతులు ఇచ్చేశారని దీంతో కాలుష్యం ఎక్కువైందన్నారు. మరో మూడు క్రషర్లకు మళ్లీ అనుమతులు ఇచ్చినట్లు తెలిసిందని వాటిని వెంటనే రద్దుచేయాలని కోరారు. ఇప్పటికే క్రషర్లలో ఏర్పడే శబ్ద తాకిడికి గోడలు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా క్రషర్లకు అనుమతులిస్తూ గ్రామాలు ఖాళీచేసి వెళ్లాల్సిందే అన్నారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ క్రషర్ల అంశంపై ఈ నెల 29న జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్, వీఆర్వో, ఎంపీటీసీ, సర్పంచ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు, పక్కనే ఉన్న కరెంటు స్తంభం

గంగాధర నెల్లూరు : ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని తప్పించే యత్నంలో ఆర్టీసీ బస్సు అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో భారీ ప్రమాదం నుంచి బయటపడ్డ సంఘటన గురువారం బొబ్బిగానిపల్లె వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..చిత్తూరు – పుత్తూరు రహదారిపై నెల్లేపల్లె సమీపంలోని బొబ్బిగానిపల్లె వద్ద చిత్తూరు నుంచి పుత్తూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు పుత్తూరు వైపు నుంచి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ డ్రైవర్ నడిరోడ్డులో గుంతను తప్పించపోయి అదుపుతప్పాడు. దీంతో మీదకు వస్తు్న కంటైనర్ లారీ ఢీకొనడంతో ఆర్టీసీ బస్సును డ్రైవర్ చాకచక్యంగా పక్కకు తిప్పాడు. రోడ్డుగా కరెంటు స్తంభం పక్క నుంచి పొదల్లోకి బస్సు దూసుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని జేసీబీ సాయంతో బస్సులను తొలగించారు. ఒకవేళ కరెంటు స్తంభాన్ని ఢీకొని విద్యుత్ తీగలు తెగి బస్సుపై పడి ఉన్నపక్షంలో ఘోర ప్రమాదం జరిగేదని ప్రయాణికులు చెప్పారు. డ్రైవర్ మూలాన సురక్షితంగా బైటపడ్డామని తెలిపారు. రోడ్డు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డును కమ్మేస్తున్న కారణంగా ప్రమాదాలకు తావిస్తోందని గతంలో ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల పీఆర్‌టీయూ యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకాచారి, ప్రకాష్‌రెడ్డిస్వామి కన్నా తెలిపారు. అధ్యక్షునిడి చెన్న కేశవరెడ్డి, గౌరవాధ్యక్షులుగా గంగాధరం, కార్యదర్శిగా పురుషోత్తంతోపాటు కార్యవర్గ సభ్యులనూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని వివిధ హైస్కూళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు తమకు తెలియజేసిన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు చలపతి, కనకాచారి, దినకర్, మురుగేశ్, చెన్న కేశవులు, గంగాధరం, పవన్, నరేంద్ర రెడ్డి, శంకర్, మోహన్, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్యం పనులు

వెదురుకుప్పం : మండలంలోని మాంబేడు పంచాయతీలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ ఆధ్వర్యంలో జోరుగా పారిశుధ్య పనులు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పంచాయతీ కార్యదర్శి రమణయ్య, సర్పంచ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికర భోజనం అందించాలి



భోజనాన్ని రుచి చూస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర సూచించారు. గురువారం మండల కేంద్రమైన నారాయణవనంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని జడ్జి పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట గది, నిత్యవసర వస్తువులు ఉంచే గదిని పరిశీలించారు. విద్యార్థులకు ఎల్లవేళలా పరిశుభ్రమైన, రుచికర భోజనం అందించాలని పాఠశాల హెచ్‌ఎం శశికళకు సూచించారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పాలసముద్రం: రైతుల సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు జిల్లా సర్వే సహాయ సంచాలకులు జయరాజ్ అన్నారు. గురువారం రామకృష్ణాపురంలో తహసీల్దార్ అరుణ కుమారి, రీ–సర్వే డీటీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. జయరాజ్ మాట్లాడారు. రైతులు అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. సభలో రైతుల నుంచి 75 అర్జీలు అధికారులకు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ షీబా, మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్‌కు చెక్ పెట్టండి

పాలసముద్రం: మండలంలో ఎక్కడైనా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పక్షంలో సిబ్బంది చెక్ పెట్టాలని ట్రాన్స్‌కో ఏడీ శేషాద్రిరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన శ్రీకావేరిరాజుపురం, వెంగళరాజుకుప్పం సబ్ స్టేషన్‌ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడారు. రైతులు, వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సాయంత్రం పూట గ్రామాల్లో కరెంటు కట్ చేస్తున్నారనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, విద్యుత్ సమస్యలు ఉంటే మధ్యాహ్నంలోపు పరిష్కరించాలన్నారు. ఆరు గంటల తర్వాత ఎల్‌సీ తీసుకుని పనులు చేయడం స్వస్తి పలకాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఈ వరదరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఆళ్లమడుగు విద్యార్థి ఎంపిక



విద్యార్థికి మెడల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని ఆళ్లమడుగుకు చెందిన యువరాజ్ ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందరేషన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, నగరిలోని ఏకాంబరం కుప్పం జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీలలో తమ స్కూలు విద్యార్థి యువరాజ్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, త్వరలో విశాఖపట్నంలో నిర్వహించనున్న పోటీలలో అతడు పాల్గొంటాడని తెలియజేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అతడిని అభినందించారు.

భవనం కూలి మండల వాసి మృతి

- బెంగళూరులో ఘటన
- శోకసంద్రంలో కృష్ణంపల్లె



తులసీరాంరెడ్డికి నివాళులర్పిస్తున్న హరికృష్ణ, (ఇన్‌సెట్‌లో) మృతుడు (ఫైల్)

గంగాధరనెల్లూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఓ భవన నిర్మాణం కూలిన ఘటనలో దాదాపు పదిమంది మృతి చెందారు. వీరిలో గంగాధరనెల్లూరు మండల వాసి కూడా ఒకరు ఉండడంతో తీవ్ర విషాదం నెలకొంది. వివరాలు.. మండలంలోని వింజం పంచాయతీ కృష్ణంపల్లెకు చెందిన పట్టాభిరెడ్డి కుమారుడు తులసీరాంరెడ్డి(26) పదేళ్లుగా బెంగళూరులో మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. కొద్దిరోజులు కర్ణాటకలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తులసీరాంరెడ్డి మేస్త్రీ పని చేస్తున్న భవనం కూలి పోవడంతో దాదాపు పదిమంది మృతి చెందారు. శిథిలాల కింద మరో 30 మంది వరకూ ఉన్నట్లు కర్ణాటక రాష్ట్రం ప్రభుత్వం ప్రకటించింది. గురువారం శిథిలాల కింద తులసీరాంరెడ్డి మృతదేహం గుర్తించి వెలికి తీశారు. కృష్ణంపల్లెకు మృతదేహాన్ని బంధువులు తరలించారు. ఐదేళ్ల క్రితం కర్ణాటకకు చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్న మృతుడికి ఒక కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అతడి దుర్మరణంతో గ్రామంలో విషాదం ఆవరించింది. విషయం తెలుసుకున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ కృష్ణంపల్లెకు వెళ్లి తులసీరాంరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తూగుండ్రం హైస్కూల్లో నీటి సమస్యకు మోక్షం



తూగుండ్రం హైస్కూల్లో బోరు డ్రిల్ చేస్తున్న దృశ్యం

గంగాధరనెల్లూరు: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సహకారంతో తూగుండ్రం హైస్కూల్లో నీటి సమస్యకు మోక్షం లభించిందని పాతపాళ్యం సర్పంచ్ క్రిష్ణమనాయుడు తెలిపారు. తూగుండ్రం హైస్కూల్లో గురువారం కొత్త బోరు డ్రిల్లింగ్ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ కమిటీ చైర్మన్ సుధాకరొశెట్టి, శ్రీధర్ యాదవ్, నర్సింహులు నాయుడు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజేంద్ర నాయుడు, నేతలు, టీచర్లు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో అధిక ఆదాయం

గంగాధర నెల్లూరు: సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే రైతులకు అధిక ఆదాయం పొందవచ్చని ఏపీ ఎస్‌ఓపీసీఏ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఆర్వీ సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. సేంద్రియ రైతులు మాట్లాడారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారిణి భవాని, నర్మద, ఢిల్లీ ప్రసాద్, సిబ్బంది స్వాతి, రైతులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకే ఐక్యరాజ్య సమితి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ

నగరి : ప్రపంచ మానవ హక్కుల రక్షణకే ఐక్యరాజ్య సమితి ఏర్పాటైందని సీఐ మహేశ్వర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా.భాస్కర్‌రాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ప్రపంచ ప్రజల మానవ హక్కులను కాపాడటంలో ప్రధాన పాత్ర వహిస్తుందని తెలిపారు. లింగ సమానత్వం అనేది కేవలం నినాదంగా మిగిలిపోకూడదని, నిత్య జీవితంలో భర్తగా, సోదరుడిగా, కుమారుడిగా ఇలా వివిధ పాత్రలు పోషించాలన్నారు. స్త్రీ, పురుష హక్కులే కాకుండా, ట్రాన్స్‌జెండర్స్ యొక్క హక్కులను కూడా గౌరవించాలన్నారు. ఐక్యరాజ్య సమితి 2024 నినాదం అయిన ×మానవ హక్కులు, లింగ సమానత్వం, సామాజిక న్యాయం₹ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లను అవసరం మేరకు వినియోగించాలని, లేదంటే భవిష్యత్ నాశనం అవుతుందని సూచించారు. ఐక్యరాజ్య సమితి దినోత్సవం సందర్భంగా కళాశాల నిర్వహించిన వ్యాస రచన మరియు క్విజ్ పోటీల్లో విజేతలైన వెన్నెల, మోహన్, నేతాజీ, భానుప్రియ, చారులత, జెనీష్ కుమార్‌కు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ డా.ఇందిరా ప్రియదర్శిని, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ భాస్కర్, డీఆర్సీ, సాంస్కృతిక విభాగం కో–ఆర్డినేటర్ అరుణ కుమారి, జేకేసీ కో–ఆర్డినేటర్ పంకజ, సీఏ విభాగాధిపతి .శ్రీలక్ష్మి, భౌతిశాస్త్ర విభాగాధిపతి సుహాసిని, ఆంగ్ల విభాగాధిపతి రేవతి, అధ్యాపకులు కుమారి, భాషా, శివకుమార్, జ్యోతి పాల్గొన్నారు.